ప్రజాశక్తి
శనివారం 08 నవంబర్ 2025
5
కర్నూలు





జెండాను ఆవిష్కరిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్

అక్టోబర్ విప్లవ స్ఫూర్తితో పోరాటం

- సోషలిజమే మానవజాతి మనుగడకు సరైన మార్గం
- సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

అక్టోబర్ విప్లవస్ఫూర్తితో కార్మికులు, కర్షకులు ఉద్యోగులు పోరాడి 13 గంటల పని విధానానికి వ్యతిరేకంగా పోరాడాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్, రాష్ట్ర కమిటీ సభ్యులు రామన్న, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అన్నారు. రాత్రిపూట మహిళలు పనిచేయడానికి వ్యతిరేకంగా కార్మికులు కష్టజీవుల హక్కుల కోసం సోవియట్ రష్యా ప్రభుత్వం ఆనాడు ప్రజలకు అందించిన అందరికీ విద్య ఉపాధి ఇల్లు ఆరోగ్యం తిండి కోసం పోరాటాలు ఉధృతం చేయాలన్నారు. అక్టోబర్ విప్లవ 108వ దినోత్సవాన్ని సుందరయ్య జంక్షన్‌లో సిపిఎం నగర కార్యదర్శి టి.రాముడు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. మొదట సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్ పతాకావిష్కరణ చేశారు. అనంతరం రాష్ట్ర కమిటీ సభ్యులు రామన్న, జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్ జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు పిఎస్.రాధాకృష్ణ, ఎండి.ఆనంద్‌బాబు మాట్లాడారు. మానవజాతి మనుగడకు సరైన మార్గం సోషలిజమే అని తెలిపారు. రష్యాలో సోషలిజం, 108 ఏళ్ళక్రితం, 1917 నవంబర్ 7న రష్యాలో కార్మికులు, రైతులు అందరూ ఏకమై అక్కడి దోపిడీ శక్తుల్ని తరిమేసి తమదైన రాజ్యాన్ని స్థాపించుకున్నారు. అప్పటినుంచీ అక్కడ దున్నేవాడిదే భూమి అయిందన్నారు. యుక్తవయస్సు వచ్చిన ప్రతీవారికీ పని ఒక హక్కుగా మారిందని, తిండి, ఇల్లు, చదువు, ఆరోగ్యం అందరికీ హక్కుగా వచ్చిందన్నారు. మహిళలకు బలవంతపు ఇంటిచాకిరీ నుండి విముక్తి లభించిందన్నారు. శాస్త్రవిజ్ఞానం ఆ కష్టజీవుల రాజ్యంలో ఉరకలు, పరుగులతో పురోగమించిందని తెలిపారు. ఆ ఫలితాలు అక్కడి ప్రజలందరికీ దక్కాయన్నారు. కేవలం మూడు దశాబ్దాలలోపే సోవియట్ రష్యా ప్రపంచంలోనే ఒక అగ్రస్థాయి దేశంగా అవతరించిందన్నారు. కష్టపడకుండా సోమరిగా, ఇతరుల కష్టాన్ని కొల్లగొట్టి బతికే పరాన్నజీవులు అనేవారు లేకుండా పోయారన్నారు. 'కష్టపడడం మన ఖర్మ...దానిని కొల్లగొట్టి లాభపడడం వాడి హక్కు' అనుకుంటూ బతుకులీడుస్తున్న ఇతర దేశాల ప్రజానీకానికి సోవియట్ రష్యాలో జరిగిన ఈ అద్భుతం గొప్ప ఉత్తేజాన్నిచ్చిందన్నారు. మన దేశంలో సైతం 'రోటీ, కపడా ఔర్ మకాన్' 'జల్, జంగిల్ జమీన్' మన హక్కులని, 8 గంటల పనిదినం అమలు కావాలని, 'స్వాతంత్ర్యం మన జన్మహక్కు' అని, కుల, లింగ వివక్షత, అంతరానితనం, మహిళలపై అణచివేత అంతరించాలని కోరుతూ దేశవ్యాప్తంగా ప్రజలు స్వాతంత్ర్య పోరాటంలో భాగస్వాములయ్యారన్నారు. సోషలిజం సాధిస్తున్న విజయాలను, దాని ప్రేరణతో ప్రపంచవ్యాప్తంగా కష్టజీవులలో తలెత్తుతున్న పోరాటాలను చూసిన దోపిడీ శక్తులు బెంబేలెత్తాయన్నారు. కుట్రల నడుమ సోవియట్ యూనియన్ లో సోషలిజం దెబ్బ తిన్నదనే దానిని చూపించి 'సోషలిజం పని అయిపోయిందని, దోపిడీ రాజ్యమే గతి అని" ప్రచారం చేశారని, కార్పొరేట్లు, తమ దోపిడీ పాలనకు నయా ఉదారవాదమని ముద్దుపేరు పెట్టారన్నారు. అదే అందరికీ శరణ్యం అని డప్పు కొట్టారన్నారు. ఈ నయా ఉదారవాదం ముసుగులో ప్రజల కష్టాన్ని, ఉమ్మడి సంపదను, ప్రభుత్వ రంగాన్ని, సహజవనరులను, భూములను కొల్లగొట్టడం మొదలుపెట్టారన్నారు. ఇలాంటి తరుణంలో నేడు కూడా ప్రపంచవ్యాప్తంగా తలెత్తుతున్న అనేక సంక్షోభాలకు చక్కనైన పరిష్కారం సోషలిజమే అని అర్థమవుతుందని తెలిపారు. జిల్లా కమిటీ సభ్యులు నగేష్, గురు శేఖర్ నగర కార్యదర్శి వర్గ సభ్యులు సుధాకరప్ప, నరసింహులు, ప్రభాకర్, నగర కమిటీ సభ్యులు మహమ్మద్ రఫీ, బికె రామకృష్ణ, ఏసు, హుస్సేన్ బాష చలపతి జమ్మన్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రంగప్ప, సిఐటియు నగర ఉపాధ్యక్షులు ఓబులేష్ నాయకులు నాగరాజు, వెంకటస్వామి పాల్గొన్నారు.

రబీకి నీళ్లివ్వలేం..!

- జడ్‌పి సమావేశంలో స్పష్టం చేసిన అధికారులు
- వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి : సభ్యులు
- రైతు సమస్యలపై సుదీర్ఘ చర్చ

ఈ ఏడాది రబీకి పంటలకు నీళ్లివ్వలేమని జలవనరుల శాఖ అధికారులు జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో స్పష్టం చేశారు. రైతు సమస్యలపై సుదీర్ఘ చర్చ సాగింది. అధిక వర్షాల వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలని పలువురు సభ్యులు కోరారు...

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో జడ్‌పి ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన శుక్రవారం జడ్‌పి సమావేశ మందిరంలో నిర్వహించారు. వ్యవసాయ, ఉద్యానవన, డ్వామా, మత్స్య, దేవాదాయ శాఖలకు సంబంధించి చర్చించారు. ఆయా శాఖలకు సంబంధించి జిల్లా అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. రబీలో తుంగభద్ర డ్యాం గేట్ల మరమ్మతుల వల్ల నీళ్లివ్వలేమని బోర్డు అధికారులు చెప్పారని, దాంతో జిల్లాలో ఎల్ఎల్‌సి, సుంకేసుల, కెసి కెనాల్ నుంచి రబీకి నీళ్లివ్వలేమని జలవనరుల శాఖ ఎస్ఈ తెలిపారు. ఖరీఫ్‌లోనూ డిసెంబర్ 20 వరకే ఇస్తామని టిబి బోర్డు అధికారులు తెలిపారన్నారు. మద్దికెర జడ్‌పిటిసి మాట్లాడుతూ ఉల్లిని క్వింటా రూ.1200తో కొంటామన్నారని, రెండు రోజులు కొని ఎత్తేశారని అన్నారు. హెక్టారుకు రూ.50వేలు ఇస్తామని ప్రకటించిన సొమ్ము ఎప్పుడిస్తారని ప్రశ్నించారు. ఇన్‌పుట్ సబ్సిడీకి సంబంధించి 13వేల ఎకరాలకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని, ఇంకా విధివిధానాలు అందలేదని ఉద్యాన శాఖ అధికారి సమాధానం ఇచ్చారు. ఓర్వకల్లు జడ్‌పిటిసి మాట్లాడుతూ శనగ బయట మార్కెట్‌లో రూ.5600 ఉంటే ప్రభుత్వం రూ.5850కు అమ్ముతూ సబ్సిడీ అని ఎలా అంటున్నారని ప్రశ్నించారు. మొక్కజొన్న నష్టపోతున్నా ఇప్పటికీ కొనుగోళ్లు ప్రారంభించలేదన్నారు. నంద్యాల జిల్లాకు రూ.50వేల ఇన్‌పుట్ సబ్సిడీ లేదంటున్నారని జూపాడుబంగ్లా ఎంపిపి తెలిపారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు త్వరగా ఏర్పాటు చేయాలని కోరారు. వరి పంట చాలా దెబ్బతిందని మహానంది జడ్‌పిటిసి ప్రస్తావించారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు పెడతారా? పెట్టరా? స్పష్టం చేయాలని కొత్తపల్లె జడ్‌పిటిసి సుధాకర్ రెడ్డి కోరారు. క్వింటా రూ.1200తో ఉల్లి కొన్నా ఆ డబ్బులు ఇంకా పడలేదని సిబెళగల్ ఎంపిపి మునెప్ప ప్రస్తావించారు. ఆత్మహత్య చేసుకుంటామన్న రైతులపైనే కేసులు పెట్టారన్నారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని వెల్దుర్తి జడ్‌పిటిసి కోరారు. రైతులకు ఇన్సూరెన్స్, పంట నష్టపరిహారం అందేలా చూడాలని హాలహర్వి జడ్‌పిటిసి విన్నవించారు. ఎక్కడా శనగ విత్తనాలు స్టాక్ లేదని, పత్తి రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారని కురువ కార్పొరేషన్ ఛైర్మన్ మాన్వి దేవేంద్రప్ప సమావేశం దృష్టికి తెచ్చారు.



సమావేశంలో మాట్లాడుతున్న కర్నూలు కలెక్టర్ డాక్టర్ సిరి. వేదికపై జడ్‌పి ఛైర్మన్, నంద్యాల కలెక్టర్

వలసల నివారణకు ఏం చర్యలు తీసుకున్నారు?

డ్వామాపై చర్చ సందర్భంగా వలసల నివారణకు ఏం చర్యలు తీసుకున్నారని వెల్దుర్తి జడ్‌పిటిసి ప్రశ్నించారు. ఉపాధి పనుల్లో చాలా అవినీతి జరుగుతోందన్నారు. ఎఫ్ఎలను రాజకీయ కక్షతో తొలగించారని, కొత్త వారికి పని చేయించడం కూడా రాదని జూపాడుబంగ్లా జడ్‌పిటిసి తెలిపారు. జిల్లాలో గ్రామాలకు గ్రామాలే వలస పోతున్నాయని, గ్రామాల్లోనే పనులు కల్పిస్తున్నామని అవగాహన కల్పిస్తున్నారా అని జడ్‌పి ఛైర్మన్ అధికారులను ప్రశ్నించారు. డ్వామా పిడి వెంకట రమణయ్య మాట్లాడుతూ వలసల నివారణకు వంద రోజుల పని కల్పిస్తున్నామని, వ్యవసాయ పనుల వల్ల ఉపాధి పనులకు రావడం లేదని తెలిపారు. రూ.307 మాత్రమే రోజులు ఇవ్వగలమన్నారు.

ఎమ్మెల్యేలు, ఎంపిలు, మంత్రులు డుమ్మా

జిల్లాలో 12 మంది అధికార పార్టీ ఎమ్మెల్యేలు, ఇద్దరు వైసిపి ఎమ్మెల్యేలు, ఇద్దరు టిడిపి ఎంపీలు, ఉమ్మడి జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉండగా పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత మినహా ఎవరూ హాజరు కాలేదు. ఎమ్మెల్యేలు రాకపోవడం దురదృష్టకరమని కొత్తపల్లె జడ్‌పిటిసి సుధాకర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తాము కష్టపడి వస్తే సమస్యలు వినేందుకు ఓ మంత్రి లేడు.. ఓ ఎమ్మెల్యే లేడు అని సి బెళగల్ ఎంపిపి అన్నారు.

స్కూల్ దగ్గర మద్యం దుకాణం తొలగించండి

బ్రాహ్మణకొట్కూరులో జడ్‌పి పాఠశాల దగ్గర ఉన్న మద్యం దుకాణాన్ని తొలగించాలని నందికొట్కూరు జడ్‌పిటిసి కలీమున్నీసా కోరారు. కొలతలు వేయిస్తామని అధికారులు చెప్పగా తాను కొలతలు అడగడం లేదని, దుకాణాన్ని మార్చాల్సిందేనని అన్నారు. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలుతీరు, తదితర సమస్యలపై సభ్యులు లేవనెత్తారు.

కౌలు రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి

- పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత



అధిక వర్షాల కారణంతో పాణ్యం నియోజకవర్గంలో పంటలు దెబ్బ తిన్నాయని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత తెలిపారు. కౌలు రైతులకు నష్ట పరిహారం ఇప్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు త్వరగా ఏర్పాటు చేయాలని కోరారు. వ్యవసాయ పరికరాలు ఎక్కువ సంఖ్యలో అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.


ఉన్నతాధికారుల దృష్టికి రబీకి నీటి అంశం : కర్నూలు కలెక్టర్ డాక్టర్ ఎ సిరి

జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ సిరి మాట్లాడుతూ రబీసీజన్‌కు నీళ్ల ఇవ్వలేక పోతున్నామనే అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసిన ఉల్లి పంటకు సంబంధించి రూ.10 కోట్లు ఇప్పటికే రైతుల ఖాతాల్లో జమ అయ్యాయని, మిగిలిన రూ.8 కోట్ల మొత్తాన్ని కూడా త్వరలోనే రైతుల ఖాతాల్లో జమ చేస్తామని తెలిపారు. వలసలు వెళ్లకు స్థానికంగా పనులు కల్పించేలాఇ చర్యలు తీసుకుంటున్నామన్నారు.

కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు : నంద్యాల కలెక్టర్ జి.రాజకుమారి

నంద్యాల జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వం త్వరలోనే చర్యలు తీసుకుంటుందని తెలిపారు. మొంథా తుఫాను వల్ల పంట నష్టపోయిన వివరాలతో నష్టపరిహార నిమిత్తం నివేదికను ప్రభుత్వానికి సమర్పించామన్నారు. ఎన్‌డిఎల్-9 రకం వరి పంట సాగు చేసిన రైతులు తేమ తగ్గిన తర్వాత ప్రభుత్వ మద్దతు ధర కంటే ఎక్కువ ధరకు విక్రయించే అవకాశం ఉందన్నారు. సమావేశంలో కర్నూలు జెసి నూరుల్ కమర్, జడ్‌పి సీఈఓ నాసర రెడ్డి, నంద్యాల, కర్నూలు జిల్లాల అధికారులు పాల్గొన్నారు.

కొండారెడ్డి బురుజు వద్ద వందేమాతర గీతాలాపన చేస్తున్న అధికారులు



స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తిని నింపుకోవాలి

- జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. సిరి

ప్రజాశక్తి -కర్నూలు కలెక్టరేట్

స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తిని ప్రతి ఒక్కరు నింపుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి అభిప్రాయం వ్యక్తం చేశారు. వందేమాతరం150 ఏళ్ల సంస్మరణోత్సవంను పురస్కరించుకొని కర్నూలులో కొండారెడ్డి బురుజు వద్ద వందేమాతర గీతం ఆలాపన చేశారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి మాట్లాడుతూ వందేమాతర గీతం భారత ఆత్మను ప్రతిబింబించిన నినాదమని పేర్కొన్నారు. అది ఒక జాతిని మేల్కొలిపిన శక్తిఅని తెలిపారు. వందేమాతరం స్వాతంత్ర్య ఉద్యమకారులకు మనోబలాన్ని ఇచ్చి, సామాన్యులను సమరయోధులుగా మార్చిందని, ఈ పాట భారతమాత స్ఫూర్తిని ప్రతిబింబిస్తుందని, భారత ప్రజల ఐక్యతను, వైవిధ్యాన్ని జరుపుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్, సెట్కూరు సిఇఒ డాక్టర్ వేణుగోపాల్ , జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనూరాధ, ఆర్ఐఒ లాలప్ప , తదితరులు పాల్గొన్నారు.

వాట్సప్ సేవలు వినియోగించుకోవాలి : జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి

జిల్లాలోని వంద శాతం కుటుంబాలు వాట్సప్ గవర్నెన్స్ సేవలను వినియోగించుకోవాలని కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి అన్నారు. జిల్లా కలెక్టర్ అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రతి కుటుంబం మనమిత్ర యాప్ ద్వారా వాట్సప్ గవర్నెన్స్ సేవలు వినియోగించుకునేలా సచివాలయ ఉద్యోగులు ప్రతి ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా సులభంగా ఆన్‌లైన్ ద్వారా సేవలు అందించాలన్నారు.

రిడ్జ్ విద్యార్థులు వందేమాతరం గేయాలపన

రిడ్జ్ ఎన్‌సిసి విద్యార్థులు వందేమాతరం గేయాలాపన చేశారు. కర్నూలు నగరంలోని స్థానిక కొండారెడ్డి బురుజు సమీపంలో పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. ఎన్‌సిసి కేడెట్లు పూర్తి 'వందేమాతరం'పాటను సమూహికంగా ఆలపించి, ప్రదర్శనలో పాల్గొన్నారు.

దేశభక్తిని నింపే గేయం-రిజిస్ట్రార్ డాక్టర్ జి. శ్రీనివాస్

యావత్ భారతావనిలో దేశభక్తిని నింపే స్ఫూర్తి మంత్రం వందేమాతర గేయమని క్లస్టర్ యూనివర్సిటీ ఇంచార్జి రిజిస్ట్రార్ డాక్టర్ జి. శ్రీనివాస్ పేర్కొన్నారు. క్లస్టర్ యూనివర్సిటీ క్రీడా మైదానంలో వందేమాతరం సామూహిక గేయాలాపన చేశారు. ఇంచార్జి రిజిస్ట్రార్ డాక్టర్ జి. శ్రీనివాస్ , క్లస్టర్ యూనివర్సిటీ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఒకేషనల్ లో వందేమాతరం వేడుకలు

కర్నూలు నగరంలోని బి క్యాంప్ ప్రభుత్వ వొకేషనల్ జూనియర్ కళాశాలలో శుక్రవారం ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.నాగస్వామినాయక్ ఆధ్వర్యంలో 'వందేమాతరం 150 వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ గీతం ద్వారా కలిగిన ప్రేరణాత్మక శక్తి గురించి కళాశాల ప్రిన్సిపల్ వివరించారు. కళాశాల విద్యార్థులు వందేమాతరం గీతాన్ని ఆలపించారు. కళాశాల లెక్చరర్స్ ప్రసన్న కుమార్, రామకృష్ణ, సోమేష్,ఉల్గోజి రావు, చిన్న మల్లేశ్వరుడు, సుజాత, గిరిజారాణి, లక్ష్మి ,జసింత, శ్రీధర్ , విద్యార్థులు పాల్గొన్నారు.



వందేమాతరం గీతం ఆలపిస్తున్న ఎస్‌పి విక్రాంత్ పాటిల్

ఎస్‌పి వందేమాతరం గీతాలాపన


ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్

వందేమాతరం గీతం రచించి 150 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు కర్నూలు జిల్లా ఎస్‌పి శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో పలువురు పోలీస్ అధికారులతో, సిబ్బందితో కలిసి వందేమాతరం గీతాలాపన చేశారు. ఎస్‌పి విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ వందేమాతరం జాతీయ గేయం ఆలాపన భారత స్వాతంత్ర్య సమరానికి ప్రేరణ నిచ్చిందని అన్నారు. బంకించంద్ర ఛటర్జీ 1875 నవంబర్ 7న జాతీయ గేయం ను రచించి 150 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భాన్ని పురస్కరించుకుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ గీతాలాపన కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. వందేమాతర జాతీయ గేయం స్వాతంత్ర్య ఉద్యమకారులకు మనోబలాన్ని ఇచ్చి, సామాన్యులను సమరయోధులుగా మార్చిందన్నారు. ప్రతి ఒక్కరూ జాతీయత భావాన్ని పెంపొందించుకొని దేశాభివృద్ధికి పాటుపడాలని పేర్కొన్నారు. అడిషనల్ ఎస్‌పి అడ్మిన్ హుస్సేన్ పీరా, ఎఆర్ అడిషనల్ ఎస్‌పి కృష్ణ మోహన్ , కర్నూలు డిఎస్‌పి బాబు ప్రసాద్, హోంగార్డు డిఎస్‌పి ప్రసాద్, డిపిఒ ఎఒ విజయలక్ష్మీ, సిఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు , ఆర్ ఎస్ఐలు, పోలీసు, డిపిఒ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

- కోడుమూరు ఎస్ఐ డివై. స్వామి

ప్రజాశక్తి -కోడుమూరు



ఆటో డ్రైవర్స్‌తో మాట్లాడుతున్న ఎస్ఐ డివై. స్వామి

కోడుమూరు మండల కేంద్రంలోని ఆటో డ్రైవర్లకు కోడుమూరు ఎస్ఐ డివై.స్వామి తగు సూచనలు చేశారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించు కోకుండా ఉండాలని, కూలీలను గాని స్కూలుకు తీసుకెళ్లే పిల్లలు గాని, ఏవైనా వస్తువులను గాని పరిమితికి మించి తీసుకెళ్లకుండా రోడ్డు ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. 18 సంవత్సరాల నిండిన వారు మాత్రమే ఆటోలు నడపాలని, డ్రైవింగ్ లైసెన్సు తప్పక ఉండాలని, మద్యం సేవించరాదన్నారు. మహిళల పట్ల, వృద్ధుల పట్ల గౌరవం చూపెట్టాలన్నారు. ఆటో డ్రైవర్లు నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ఎడల వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

12న ఆర్‌యు స్నాతకోత్సవం

-ఎస్ఎస్‌వి రామకుమార్‌కు గౌరవ డాక్టరేట్ -హాజరుకానున్న గవర్నర్ అబ్దుల్ నజీర్
-వర్సిటీ వైస్ ఛాన్సలర్ వెంకట బసవరావు వెల్లడి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్



-విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌యు విసి వెంకట బసవరావు

ఈనెల 12న రాయలసీమ యూనివర్సిటి నాలుగవ స్నాతకోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నట్లు వైస్ ఛాన్సలర్ వెంకట బసవరావు పేర్కొన్నారు. ఆఫ్ ఎం గ్రీన్ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ ,ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ ఎస్ఎస్‌వి రామ కుమార్‌కు గౌరవ డాక్టరేట్ అందజేయనున్నట్లు పేర్కొన్నారు. శుక్రవారం రాయలసీమ వర్సిటీలోని సమావేశ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 12 ఉదయం 10 గంటలకు యూనివర్సిటీ ప్రాంగణంలోని ఓపెన్ ఎయిర్ థియేటర్ వద్ద ఏర్పాటుచేసిన వేదికలో స్నాతకోత్సవం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ స్నాతకోత్సవానికి రాష్ట్ర గవర్నర్ ,యూనివర్సిటీస్ ఛాన్సలర్ ఎస్.అబ్దుల్ నజీర్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ హాజరవుతారన్నారని తెలిపారు. ఎఎం. గ్రీన్ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ ,ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎస్ఎస్‌వి. రామకుమార్‌కు గౌరవడాక్టరేట్‌ను ప్రదానంచేయనున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ బోర్డ్ మెంబరుగా విధులునిర్వహిస్తున్నారన్నారు. వర్సిటీలోని ఆచార్యులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బందితో 11 కమిటీలను ఏర్పాటుచేసి పనుల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామన్నారు. పరిశోధక విద్యార్థులు కాన్వకేషనుకు ముందురోజు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ వెంకటేశ్వర్లు కార్యాలయం నుండి ఎంట్రీపాసులు పొందాలని సూచించారు. విద్యార్థితోపాటు, మరొకరికి మాత్రమే ప్రవేశం ఉంటుందన్నారు. మిగిలిన విద్యార్థులకోసం కాన్వకేషన్ రోజు ఉదయం 8 గంటలనుండి రిజిస్ట్రేషన్ కౌంటర్లు అందుబాటులో ఉంటాయని 10 గంటలకంతా కాన్వకేషన్ హాలులో సిద్ధంగా ఉండాలన్నారు. విద్యార్థితోపాటు వారి వెంటవచ్చిన కుటుంబసభ్యుని ఆధార్ కార్డు తీసుకువచ్చి ఎంట్రీపాసులు పొందవచ్చున్నారు. మొత్తం 75 బంగారు పతకాలను ప్రదానం చేస్తామని తెలిపారు. అందులో 60 పిజి విద్యార్థులకు, 15 పతకాలు ఇంజినీరింగ్ విద్యార్థులకు ప్రదానం చేయనున్నట్లు వర్సిటీ ఎగ్జామినేషన్స్ కంట్రోలర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో వర్సిటీ రెక్టార్ ఆచార్య ఎన్‌టికె. నాయక్, రిజిస్ట్రార్ డాక్టర్ బి.విజయ్ కుమార్ నాయుడు, వైస్ ప్రిన్సిపల్ ఆచార్య ఎన్. నరసింహులు, డీన్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య పివి. సుందరానంద్, డీన్ ఆఫ్ అకడమిక్ అఫైర్స్ ఆచార్య ఆర్.భరత్‌కుమార్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

జిజిహెచ్‌లో కేన్సర్‌పై అవగాహన

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల స్టేట్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్‌లో శుక్రవారం జాతీయ కేన్సర్ అవగాహన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. వైద్య విద్యార్థులు, నర్సింగ్ విద్యార్థులు, వైద్యులు, నర్సింగ్ సిబ్బంది రోగులు పాల్గొన్నారు. ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ ప్రకాష్ మాట్లాడుతూ కేన్సర్‌ను త్వరితగతిన గుర్తించి సమయానికి చికిత్స ద్వారా నివారించవచ్చున్నారు. ప్రజల్లో అవగాహన పెంపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఆసుపత్రి సూపరిండెండెంట్ డాక్టర్ కె. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేన్సర్‌పై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించడం, ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం ఎంత ముఖ్యమో తెలియజేయడానికి ఇలాంటి అవగాహన కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తామని అన్నారు. కెఎంసి ప్రిన్సిపాల్ డాక్టర్ చిట్టి నరసమ్మ మాట్లాడుతూ కేన్సర్ చికిత్సలో నిపుణులు వివిధ రకాల కేన్సర్‌లు, వాటి లక్షణాలు, నివారణ చర్యలపై అవగాహన కల్పించారని అన్నారు. స్టేట్ కేన్సర్ ఇనిస్టిట్యూట్ సిఎస్ఆర్ఎంఒ డాక్టర్ హేమనలిని, ఆసుపత్రి ఆర్ఎంఒ డాక్టర్ వెంకటరమణ, వైద్యులు పాల్గొన్నారు.



జాతీయ కేన్సర్ దినోత్సవ ప్రదర్శనలో వైద్యాధికారులు, విద్యార్థులు

డిఎంహెచ్ఒ కార్యాలయంలో : కేన్సర్ వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండాలని జిల్లా వైద్య , ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎల్.భాస్కర్ అన్నారు. జాతీయ కేన్సర్ అవగాహన దినోత్సవం సందర్భంగా డిఎంహెచ్ఒ కార్యాలయంలో అవగాహన ర్యాలీ డిఎంహెచ్ఒ డాక్టర్ ఎల్.భాస్కర్ జెండా ఊపి ప్రారంభించారు. అవసరమైన వారికి పరీక్షలు చేయడం, వ్యాధి నిర్ధారణ అయితే చికిత్స అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సమస్యలు పరిష్కరించండి

ఎమ్మెల్యేకు గురుకుల కళాశాల ప్రిన్సిపల్స్ వినతి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కోడుమూరు నియోజకవర్గ పరిధిలో ఉన్న ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని దిన్నెదేవరపాడు బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ బి.నిర్మల, సి బెళగల్ ఇన్చార్జి ప్రిన్సిపల్ చింతలయ్య కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరిని కర్నూలు మండలం పసుపుల గ్రామంలోని ఆయన స్వగృహంలో నిర్వహించిన పబ్లిక్ గ్రీవెన్స్‌లో వినతి పత్రం అందజేశారు. ఈమేరకు ఆయనకు మర్యాదపూర్వకంగా పూలబోకెను అందజేసి సమస్యలను వివరించారు. కర్నూలు రూరల్ మండలం పరిధిలోని దిన్నెదేవరపాడు జగన్నాథ గట్టుపై ఉన్న ఆర్‌టిఒ కార్యాలయం నుంచి ఎపిఎస్‌డబ్ల్యుఆర్ఎస్ఐ బాలి జూనియర్ కళాశాలకు బిటి రోడ్డును ఏర్పాటు చేయాలని సదరు కళాశాల ప్రిన్సిపల్ బి.నిర్మల కోరారు. సిబెళగల్ లో ఉన్న బాలుర జూనియర్ కళాశాలలో కొన్నిపై అంతస్తు భవనాలు శిథిలావస్థకు చేరాయని, వాటిని పునర్నిర్మించాలని కోరారు. అందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ సమస్యలను పరిష్కరించేందుకు తగిన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే నిర్వహించిన గ్రీవెన్స్ లో పలువురు ప్రజానీకం తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. సంబంధిత అధికారులకు ఫోన్లో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. అధ్యాపకులు మీనాక్షి, భారతి, శారద, పలువురు ప్రజలు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకువినతి ఇస్తున్న ప్రిన్సిపల్స్

డ్రగ్స్ కంట్రోల్‌అడ్మినిస్ట్రేషన్ ఎడి గా డి.హరిహర తేజ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్



డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ కర్నూలు అసిస్టెంట్ డైరెక్టర్ గా డి. హరిహర తేజ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో అసిస్టెంట్ డైరెక్టర్ గా పని చేసిన ఎటివి రమాదేవి డిప్యూటీ డైరెక్టర్ గా పదోన్నతి పొంది ఏలూరు కు బదిలీ పై వెళ్లారు. ఆమె స్థానంలో నెల్లూరు అసిస్టెంట్ డైరెక్టర్ గా పనిచేస్తున్న పి.రమేష్ రెడ్డిబదిలీపై వచ్చి బాధ్యతల తీసుకున్న ఒక రోజు లోనే ఏ కారణాల వల్లనో ఆయనను తిరిగి నెల్లూరుకే బదిలి చేశారు. ఆయన స్థానంలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పదోన్నతి పొందిన నెల్లూరు డి. హరిహర తేజ బదిలి అయిన ఒక రోజులోనే తిరిగి కర్నూలుకు బదిలి చేశారు. దానితో కర్నూలు అసిస్టెంట్ డైరెక్టర్ డి.హరిహర తేజ బాధ్యతలు తీసుకున్నారు.

ఇబ్రహీం సేవలు మరువలేని

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కెవి నారాయణ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు పేర్కొన్నారు. శుక్రవారం ప్రాంతీయ కార్యదర్శి జె.మోహన్ అధ్యక్షతన ఎన్‌టిఆర్ పార్కులో ఇబ్రహీం సంస్మరణ సభ నిర్వహించారు. ఇబ్రహీం గత నెల 13న అకాల మరణం చెందారని పార్టీకి తీరని లోటని వాపోయారు. 2010 నుండి పార్టీ సభ్యులుగా, శాఖా కార్యదర్శిగా, ప్రాంతీయ సభ్యులుగా రానించారని సలీమ్ శంకర్ అక్రమ భూముల పోరాటంలో చురుకుగా పాల్గొన్నారని అన్నారు. మండలంలో అనేక సమస్యల పరిస్కారానికి కృషి చేశారని ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఆయన చిత్రపటానికి నివాళ్ల నివాళులు అర్పించారు. హమాలీ, ఆటో, గ్రామ సేవకులు, ఆశా కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.



నూతన ఎస్ఐకి శుభాకాంక్షలు తెలిపిన జె.మోహన్, కార్మిక సంఘాల నాయకులు

ఎస్ఐని కలిసిన కార్మికులు, నాయకులు

ప్రజాశక్తి సి బెళగల్

సి బెళగల్ నూతన ఎస్ఐ గా బాధ్యతలు చేపట్టిన వేణుగోపాల్ రాజును హమాలీ, ఆటో సంఘం, కార్మికులు సిఐటియు ప్రాంతీయ కార్యదర్శి జె మోహన్ సమక్షంలో శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్ఐ పరమేష్ నాయక్ ఇటీవల బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో వేణుగోపాల్ రాజు రావడంతో పూలమాలతో సత్కరించారు. మండలంలో పోలీస్ సేవలు విస్తరించాలని కోరారు. న్యాయాన్ని, ధర్మాన్ని రక్షించి సమాజంలో గుర్తింపు పొందాలని ఎస్ఐని, సిబ్బందిని కోరారు.


మాట్లాడుతున్న హనుమంతు

పాదయాత్రను జయప్రదం చేయండి

- సిపిఎం ప్రాంతీయ కార్యదర్శి హనుమంతు

ప్రజాశక్తి-ఆలూరు

ఈనెల 9, 10వ తేదీల్లో సిపిఎం ఆధ్వర్యంలో ఆలూరు నుంచి ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు జరిగే పాదయాత్రను జయప్రదం చేయాలని సిపిఎం ఆలూరు ప్రాంతీయ కార్యదర్శి పి.హనుమంతు కోరారు. శుక్రవారం ఆలూరు జ్యోతిబసు భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆలూరు ప్రాంత ప్రజలకు సాగు, తాగునీరు అందించడానికి ప్రభుత్వాలు, పాలకులు స్వార్థ ప్రయోజనాల కోసమే పని చేస్తున్నారని విమర్శించారు. వేదవతి (హగరి) నది నుంచి ప్రతేడాది వందల టిఎంసిల నీరు తుంగభద్రలో కలిసి సముద్రం పాలవుతోందని చెప్పారు. వేదవతిపై ఎత్తిపోతల ద్వారా 8 టిఎంసిలతో ప్రాజెక్ట్ నిర్మిస్తే అధికారికంగా 80 వేల ఎకరాలకు సాగు నీరందించి, 253 గ్రామాలకు అందించవచ్చని రిటైర్డ్ ఇంజనీర్ సుబ్బారాయుడు ప్రభుత్వానికి నివేదిక అందించారని తెలిపారు. వేదవతి, నగరడోన రిజర్వాయర్లకు నిధులు కేటాయించి పూర్తి చేయాలని, ప్రభుత్వాలు తట్టి లేపేందుకు పాదయాత్ర నిర్వహించి మహా ధర్నా చేపట్టనున్నట్లు చెప్పారు. రైతులు, కూలీలు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సిపిఎం నాయకులు కెపి.నారాయణ స్వామి, కృష్ణ, ఈరన్న, గోవర్ధన్ పాల్గొన్నారు.

పోరాటాలతోనే హక్కుల సాధన

- సిపిఎం జిల్లా నాయకులు వీరశేఖర్

ప్రజాశక్తి - దేవనకొండ

ప్రపంచంలో అణచివేయబడుతున్న, హక్కులు కోల్పోతున్న జీవితాలకోసం పోరాటం చేస్తున్న వారందరికీ ఎర్రజెండా పోరాటాలే ఆశాజనం అని సిపిఎం జిల్లా నాయకులు బి.వీరశేఖర్ పేర్కొన్నారు. ప్రథమ సోషలిస్టు విప్లవ దినోత్సవం సందర్భంగా తెర్నేకల్ గ్రామంలో వీరశేఖర్ సిపిఎం జెండాను ఆవిష్కరించారు. సిపిఎం శాఖ కార్యదర్శి మహబూబ్ బాషా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 1917, నవంబర్ 7న ప్రపంచ వ్యాప్తంగా మొదటిసారిగా విప్లవం విజయవంతమైన రోజును స్ఫూర్తిగా తీసుకుని సామ్రాజ్యవాద, పెట్టుబడిదారి, మతతత్వ విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని కోరారు. సిపిఎం నాయకులు బజారి, సుభాన్, రవీంద్ర, దొడ్డప్ప, పరమేష్, లక్ష్మిరెడ్డి, నాగేంద్ర, శివ, రవి, శాంతిరాజు, చెన్నప్ప పాల్గొన్నారు.


జెండాను ఆవిష్కరిస్తున్న వీరశేఖర్

మద్యం సేవించి వాహనాలు నడిపితే జైలు శిక్ష

- సిఐ గంగాధర్

ప్రజాశక్తి - ఆస్పరి

మద్యం సేవించి వాహనాలు నడిపితే జైలు శిక్ష, జరిమానా విధిస్తామని సిఐ గంగాధర్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతాయని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని, తల్లిదండ్రులు కూడా పిల్లలకు మోటార్ బైకులు ఇవ్వకుండా వారిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని సూచించారు. మండలంలో రోజూ డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

సమస్యలు తెలుసుకునేందుకే ప్రజా దర్బార్

- టిడిపి ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు

ప్రజాశక్తి - ఆదోని

క్షేత్రస్థాయిలో సమస్యలు తెలుసుకునేందుకు ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే, టిడిపి ఇన్‌ఛార్జి మీనాక్షి నాయుడు తెలిపారు. టిడిపి అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు శుక్రవారం ఆయన స్వగృహంలో ఎపి హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ మన్నె దేవేంద్ర, సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు ఆధ్వర్యంలో అర్జీలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ... ప్రజల నుంచి అందిన అర్జీల్లో రెవెన్యూ శాఖకు సంబంధించిన ఆర్‌ఓఆర్, అడంగల్, రీసర్వే అంశాలపై ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. అర్జీలను సంబంధిత అధికారులకు పంపించి, పరిష్కారం దిశగా సూచనలిచ్చి, ప్రతి అర్జీ స్టేటస్‌ను నిరంతరం తెలుసుకుంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. టిడిపి యువ నాయకులు సిద్ధార్థ నాయుడు, ఎపి హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ రామకృష్ణ, బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజనేయులు, బసాపురం రామస్వామి, టిడిపి మండల అధ్యక్షులు శివప్ప, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి వెంకటేష్ చౌదరి, అయ్యన్న, వీరేష్, మల్లికార్జున పాల్గొన్నారు.


అర్జీలు స్వీకరిస్తున్న మీనాక్షి నాయుడు

సాగు, తాగునీరందించాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు వెంకటేశులు

ప్రజాశక్తి - కోసిగి

మండలంలోని రైతులకు సాగు, తాగునీరందించాలని, వలసలు నివారించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు కె.వెంకటేశులు డిమాండ్ చేశారు. ఈనెల 9, 10వ తేదీల్లో పెద్దకడబూరు నుంచి ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు జరిగే పాదయాత్రలు, 10న సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని కోరారు. శుక్రవారం స్థానిక ఆర్‌టిసి బస్టాండ్‌లో సిపిఎం మండల కన్వీనర్ రాముడు అధ్యక్షతన ఆటోజాతాను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. అభివృద్ధిలో మండలం అత్యంత వెనుకబడిందని, సాగునీరు లేక ఇక్కడి రైతులు కేవలం వర్షాధారంపైనే పంటలు సాగు చేస్తున్నారని తెలిపారు. వ్యవసాయ కూలీలకు పని దినాలు తగ్గిపోవడంతో బతకడానికి పిల్లాపాపలతో సుదూర ప్రాంతాలకు వలసలు పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతంలో ఆర్‌డిఎస్ కుడికాలువ నిర్మించాలని, పులికనుమ ప్రాజెక్టుకు ప్రత్యేక తూము ఏర్పాటు చేసి సాగు, తాగునీరందించాలని డిమాండ్ చేశారు. ఆటో జాతా మండలంలోని బెళగల్, చిన్నభూంపల్లి, పెద్దభూంపల్లి, ఐరన్‌గల్లు, జంపాపురం, సజ్జలగూడెం, దుద్ది, కోల్మాన్‌పేట, ఆర్లబండ, కామన్‌దొడ్డి, కందుకూరు, అగసనూరు, సాతనూరు, చిర్తనకల్ సాగింది. సిపిఎం నాయకులు నాగేంద్ర, రాముడు, చిన్నన్న, వీరేష్ పాల్గొన్నారు. **కౌతాళం** మండలంలోని సులేకేరి, మధిరే, పొదలకుంట, హాల్వి, గోతులదొడ్డి, కుంభాలనూరు గ్రామాల్లో జీపుజాతా సాగింది. సిపిఎం సీనియర్ నాయకులు మల్లయ్య, మండల కన్వీనర్ ఈరన్న మాట్లాడుతూ... జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో కరువు, వలసలు నివారించడానికి తుంగభద్ర నదిపై వరద కాలువ లేదా బ్రిడ్జి కం బ్యారేజ్ నిర్మించాలని డిమాండ్ చేశారు. 2, 3 టిఎంసిల సామర్థ్యం కల చెరువులను ఏర్పాటు చేసి వరద నీటిని నిల్వ చేసుకుంటే తాగు, సాగునీటి సమస్య తీరుతుందని చెప్పారు. ఈనెల 9న పాదయాత్ర, 10న ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు మహాధర్నాను జయప్రదం చేయాలని కోరారు. నాయకులు భాస్కర్, వలీ, వీరేష్ పాల్గొన్నారు. **ఆస్పరి** మండలం ఆస్పరి, శంకరబండ, చిరుమాన్ దొడ్డి, హాలిగేరా, చిగిలి, నగరూరు, బిణిగేరి, తంగరడోన, తురువగల్లు, తొగలగల్లు, చిన్నహోతూరు, జొహరాపురం గ్రామాల్లో రెండోరోజూ జీపు జాతా సాగింది. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి బాలకృష్ణ మాట్లాడారు. ఆస్పరి మండలాన్ని వేదవతి ప్రాజెక్టు పరిధిలోకి చేర్చాలని ఈనెల 9, 10వ తేదీల్లో ఆదోని సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు చేపట్టే పాదయాత్రను జయప్రదం చేయాలని కోరారు. వేదవతి ప్రాజెక్టు ద్వారా ఆస్పరికి నీరందిస్తే మండలం అభివృద్ధితో పాటు రైతులు ఏడాదికి రెండు పంటలు పండించుకోవడానికి అవకాశం ఉంటుందని తెలిపారు. పందికోన రిజర్వాయర్ నుంచి మండలానికి పైపులైన్ వేసి సాగు, తాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించి వేదవతి ప్రాజెక్టుకు నిధులు మంజూరు చేసి త్వరగా పనులు ప్రారంభించి మండలానికి సాగు, తాగునీరందిస్తే రైతులకు, కూలీలకు చేతినిండా పని దొరుకుతుందని పేర్కొన్నారు. సిపిఎం మండల కార్యదర్శి వర్గసభ్యులు రంగస్వామి, మండల కమిటీ సభ్యులు రవి, శాఖ కార్యదర్శులు ఈరన్న, మల్లి, రంగస్వామి, శివ, అశోక్, బసవ రాజు, హనుమంతు, శశిధర్, అయ్యప్ప, బాష, ఆచారి, మహానంది, వినోద్, సత్తన్న, ఆంజనేయ పాల్గొన్నారు.


కోసిగిలో మాట్లాడుతున్న నాయకులు


కౌతాళంలో మాట్లాడుతున్న నాయకులు


ఆస్పరిలో మాట్లాడుతున్న బాలకృష్ణ

అంబులెన్స్‌ల నిర్వహణకు అనుమతి ఇవ్వాలి

- భగత్ సింగ్, సుందరయ్య ఫౌండేషన్ చైర్మన్ తాహెర్ వలీ

ప్రజాశక్తి - ఆదోని

ప్రభుత్వాస్పత్రులకు సంబంధించిన అంబులెన్స్‌లు నిరుపయోగంగా ఉన్నాయని, రోగుల సౌకర్యార్థం వాడకంలోకి తీసుకురావాలని భగత్ సింగ్ సుందరయ్య ఫౌండేషన్ ఛైర్మన్ ఎమ్.తాహెర్ వలీ కోరారు. శుక్రవారం డిప్యూటీ డిఎంహెచ్ఒ కార్యాలయంలో అధికారికి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా తాహెర్ వలీ, ఫౌండేషన్ కార్యదర్శి నవీన్ మాట్లాడారు. ఆదోని ప్రభుత్వాస్పత్రిలో రెండు అంబులెన్సులు గతంలో రోగులను తరలించేందుకు వాడేవారని తెలిపారు. ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్నాయన్నారు. వాటిని వాడకంలోకి తీసుకొచ్చేందుకు తమ ఫౌండేషన్‌కు ప్రభుత్వం అనుమతి ఇస్తే ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రజలకు సేవలు అందించాలని నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. వాహనానికి సంబంధించిన ఇన్స్యూరెన్స్, పాసింగ్, చిన్న, చిన్న మరమ్మతులు చేయించుకుని.. వాహనాలకు ప్రమాదం జరిగినా, డ్యామేజీ అయినా పూర్తి బాధ్యత భగత్ సింగ్ సుందరయ్య ఫౌండేషన్‌దేనని చెప్పారు. అందుకు సంబంధించిన అగ్రిమెంట్ రాసి ఇవ్వటానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఇప్పటికే ఒక అంబులెన్స్ తమ ఫౌండేషన్ ద్వారా ఉచిత రవాణాతో రోగులకు సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. ఫౌండేషన్ సభ్యులు రామాంజనేయులు, పవన్, అంజి, మోహన్, లక్ష్మన్న, బీరప్ప, గాదిలింగ, మల్లికార్జున, దస్తగిరి ఉన్నారు.


హెల్త్ అధికారికి వినతి పత్రం నాయకులు

షేర్‌ఖాన్ గుడిసె వాసులకు ఇంటి పట్టాలివ్వాలి

- సిపిఎం పట్టణ కార్యదర్శి లక్ష్మణ్

ప్రజాశక్తి - ఆదోని

దశాబ్ద కాలంగా నివాసముంటున్న షేర్ ఖాన్ కొట్టాల వాసులకు అక్కడే ఇంటి పట్టాలివ్వాలని సిపిఎం పట్టణ కార్యదర్శి లక్ష్మణ్ డిమాండ్ చేశారు. శుక్రవారం రెండో రోజూ పట్టణంలోని తిక్కస్వామి దర్గా ప్రాంతంలో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.పట్టణంలోని తిక్కస్వామి దర్గా సమీపంలో 60 ఏళ్లుగా గుడిసెలు వేసుకుని నివాసముంటున్న షేర్ ఖాన్ కొట్టాల గుడిసె వాసులకు ప్రభుత్వం అక్కడే ఇంటి పట్టాలివ్వాలని కోరారు. పట్టణంలో నెలకొన్న ప్రజా సమస్యలు పరిష్కరించాలని, పట్టణ సమగ్రాభివృద్ధికి సిపిఎం ఆధ్వర్యంలో ఈనెల 10న సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని డిమాండ్ చేశారు. పాలకులు, అధికారులు స్పందించి గుడిసె వాసులకు ఇంటి పట్టాలివ్వాలని కోరారు. అలాగే పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు పెండింగ్‌లో ఉన్న బైపాస్ రోడ్డు పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. పట్టణంలో రోడ్ల వెడల్పు చేస్తూ అన్ని వీధుల్లోనూ రోడ్లు, మురుగు కాలువలు, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణం చేపట్టాలని తెలిపారు. సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గసభ్యులు తిప్పన్న, పట్టణ కమిటీ సభ్యులు అజిమ్ ఖాన్, వీరేష్, స్థానికులు వీరేష్, శివ, ఈరన్న, వీరేష్, కాలనీ వాసులు ఉన్నారు.



పాదయాత్ర నిర్వహిస్తున్న నాయకులు

పీఠాధిపతుల చొరవతో ట్రాఫిక్ సమస్యకు చెక్

- రూ.30 లక్షలతో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు

- సిఐ రామాంజులు, ఎస్ఐ శివాంజల్

ప్రజాశక్తి - మంత్రాలయం

మంత్రాలయంలో భక్తులు, స్థానికులు ఎదుర్కొంటున్న ట్రాఫిక్ సమస్యకు శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థుల చొరవతో చెక్ పెట్టనున్నామని సిఐ రామాంజులు, ఎస్ఐ శివాంజల్ తెలిపారు. శుక్రవారం స్థానిక రాఘవేంద్ర సర్కిల్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. రాఘవేంద్రస్వామి దర్శనార్థమై దేశ నలుమూలల నుంచి వచ్చే భక్తులతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోందని, సెలవు రోజుల్లో మరీ తీవ్రంగా ఉంటుందని తెలిపారు. ఈ విషయంపై శాఖ ఉన్నతాధికారులతో పాటు శ్రీమఠం పీఠాధిపతులు సుభుదేంద్రతీర్థుల దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. స్పందించిన ఆయన రాఘవేంద్ర సర్కిల్‌లో ట్రాఫిక్ సిగ్నల్స్ వేసేందుకు ఆమోదించారని తెలిపారు. ఆలస్యం చేయకుండా రూ.30 లక్షలతో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారని చెప్పారు. కర్ణాటక రాష్ట్రం బెంగళూరుకు చెందిన స్కీటా సొల్యూషన్స్ సంస్థ ప్రాజెక్ట్ ఇంజినీర్ భాస్కర్‌ను పిలిపించి సర్వేకు ఆదేశించారని, రాఘవేంద్ర సర్కిల్‌ను భాస్కర్‌తో కలిసి పరిశీలించామని తెలిపారు. ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటుతో సమస్య కొంతవరకు తీరుతుందని, వాహనాల పార్కింగ్ స్థలం ఏర్పాటుతో పూర్తిగా తొలగనుందని చెప్పారు. పోలీసు హెడ్ కానిస్టేబుళ్లు భాస్కర్, మల్లికార్జున స్వామి, వెంకటేశ్వర్లు, హోమ్‌గార్డులు ఖాజా, మహబూబ్ ఉన్నారు.


మాట్లాడుతున్న సిఐ, ఎస్ఐ

అసిస్టెంట్ కమిషనర్ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - ఆదోని



ఆదోని మున్సిపల్ కార్యాలయంలో అసిస్టెంట్ కమిషనర్‌గా నాసిర్ హుస్సేన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తాను 1991 జనవరిలో మున్సిపల్ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా గుంతకల్లులో ఉద్యోగంలో చేరానని తెలిపారు. అప్పటి నుంచి సీనియర్ అసిస్టెంట్‌గా, మున్సిపల్ రెవెన్యూ ఆఫీసర్‌గా, మేనేజర్‌గా బాధ్యతలు నిర్వర్తించినట్లు చెప్పారు. ప్రస్తుతం ఆదోని మున్సిపల్ కార్యాలయంలో మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న నేపథ్యంలో ప్రమోషన్‌లో భాగంగా అసిస్టెంట్ కమిషనర్‌గా ప్రభుత్వం నియమించిందని తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, కౌన్సిల్ సహకారంతో ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తామన్నారు. పనుల నిమిత్తం వచ్చే వారి పట్ల బాధ్యతగా వ్యవహరించి బాధ్యతలు నిర్వర్తిస్తానని తెలిపారు. మున్సిపల్ ఛైర్పన్ లోకేశ్వరి, కమిషనర్ కృష్ణ, ఉద్యోగులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

శ్రీమఠానికి రూ.3.25 లక్షల విరాళం : మేనేజర్

ప్రజాశక్తి - మంత్రాలయం



ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్య క్షేత్రమైన మంత్రాలయంలోని శ్రీరాఘవేంద్ర స్వామి మఠంలో జరుగుతున్న నిత్య సేవలకు భక్తుల నుంచి రూ.3.25 లక్షల విరాళం వచ్చినట్లు శ్రీమఠం మేనేజర్ ఎస్‌కె.శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. రాఘవేంద్రస్వామి దర్శనార్థమై వచ్చిన బెంగళూరుకు చెందిన సుష్మ, తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు చెందిన శ్రీరాఘవేంద్ర సందీప్ ధన్వాడ ఈనెల 8న శ్రీమఠంలో జరగనున్న సంపూర్ణ సేవకు రూ.1.25 లక్షల చొప్పున విరాళం అందించినట్లు తెలిపారు. అదనంగా శ్రీరాఘవేంద్ర సందీప్ ధన్వాడ ఈనెల 9న నిర్వహించనున్న అన్ని బృందావనాలకు వస్త్ర సమర్పణ సేవకు మరో రూ.75 వేలు విరాళంగా అందించారని, దాతలకు శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్ర తీర్థులు ఆశీస్సులు అందించారని పేర్కొన్నారు.

భక్త కనకదాసు జయంతిని విజయవంతం చేయండి

- కురువ సంఘం జిల్లా కార్యదర్శి వీరేష్

ప్రజాశక్తి - కౌతాళం



ఈనెల 8న జరగబోయే భక్త కనకదాస జయంతిని విజయవంతం చేయాలని కురువ సంఘం జిల్లా కార్యదర్శి కురువ వీరేష్ కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. కనకదాసు జయంతిని ప్రభుత్వం నిర్వహించడం అభినందించదగ్గ విషయమని పేర్కొన్నారు. అలాగే 8న అనంతపురం జిల్లాలోని కళ్యాణదుర్గం నియోజకవర్గంలో జరిగే కనకదాసు నూతన విగ్రహావిష్కరణకు జిల్లా నుంచి కురువలు పెద్దఎత్తున తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. జిల్లాలోని ప్రతి నియోజకవర్గం నుంచి కనకదాసు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించాలని తెలిపారు. కురువ సంఘం నాయకులు శివకుమార్, హనుమేష్, దేవేంద్ర, బీరప్ప, రమేష్, వీరలింగ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ రఘురాం రెడ్డి

'స్క్రీనింగ్‌తో క్యాన్సర్ నివారణ'

ప్రజాశక్తి - ఆస్పరి

క్యాన్సర్ వ్యాధి పట్ల భయం వద్దని, స్క్రీనింగ్‌తో నివారణ సాధ్యమవుతుందని డాక్టర్ రఘురాం రెడ్డి, డాక్టర్ దుర్గాబాయి తెలిపారు. శుక్రవారం ప్రభుత్వాస్పత్రి నుంచి బస్టాండ్ వరకు 'స్క్రీనింగ్ చేయించండి. ఆరోగ్యంగా జీవించండి' అంటూ ర్యాలీ నిర్వహిస్తూ క్యాన్సర్‌పై ప్రజలకు అవగాహన కల్పించారు. క్యాన్సర్ బారిన పడిన వారు భయం వదిలి, సమయానికి పరీక్ష చేయించుకోవాలని సూచించారు. సిహెచ్ఒ నాగరాజు, సూపర్‌వైజర్ హనుమంతు, ఎఎన్ఎంలు వసుంధర, రుద్రమ్మ పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు చేయూత

ప్రజాశక్తి - మంత్రాలయం

గతేడాది జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన విద్యార్థుల తల్లిదండ్రులకు శ్రీమఠం చేయూతనందించింది. గతేడాది కర్ణాటక రాష్ట్రం ఆనెగొందిలో కొలువైన శ్రీనరహరి తీర్థుల ఆరాధన మహోత్సవాలకు వెళ్తూ మృతి చెందిన శ్రీగురుసార్వభౌమ సంస్కృత విద్యాపీఠం విద్యార్థుల కుటుంబాలకు, డ్రైవర్ శివ కుటుంట సభ్యులకు శుక్రవారం శ్రీమఠంలో పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు ఆర్థిక సహాయం అందజేశారు. శ్రీమఠంలో నలుగురు విద్యార్థుల తల్లిదండ్రులకు రూ.5 లక్షల చొప్పున ఎఫ్‌డి రూపంలో అందజేసి, వారి కుటుంబాలకు శ్రీమఠంలో ఉద్యోగావకాశాలను కల్పిస్తామని హామీఇచ్చి ఆశీర్వదించారు. శ్రీమఠం ఆధ్యాత్మిక అభివృద్ధి అధికారి శ్రీపతి ఆచార్, శ్రీగురుసార్వభౌమ సంస్కృత విద్యాపీఠం రిటైర్డ్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.వాదిరాజాచార్, సిబ్బంది ప్రకాష్ పాల్గొన్నారు.

ఈరన్న స్వామి హుండీ ఆదాయం లెక్కింపు

ప్రజాశక్తి - కౌతాళం

శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి హుండీ ఆదాయం రూ.1,37,79,215 వచ్చిందని డిప్యూటీ కమిషనర్ వాణి తెలిపారు. శుక్రవారం స్వామి వారి హుండీని లెక్కించారు. స్వామివారికి భక్తులు నగదు, బంగారం 6 గ్రాముల 750 మిల్లీగ్రాములు, వెండి 18 కిలోల 990 గ్రాములు సమర్పించారన్నారు. పర్యవేక్షణాధికారి రాంప్రసాద్, దేవాలయ పర్యవేక్షకులు మల్లికార్జున, వెంకటేష్, పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆటలపోటీలు

ప్రజాశక్తి - హోళగుంద

కనకదాసు జయంతి సందర్భంగా హోళగుంద ప్రభుత్వం జూనియర్ కళాశాల మైదానంలో శుక్రవారం విద్యార్థులకు ఆటలపోటీలు, వ్యాస రచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ప్రవీణ, కెజిబివి ఎస్ఒ దివ్యభారతి హాజరయ్యారు. మాదాసి కురువ సంఘం నాయకులు శేషప్ప, ఎస్‌కె.గిరి, పంపన్న, గాదిలింగప్ప, మల్లికార్జున స్వామి, మరిమల్ల పాల్గొన్నారు.

'ఎరువుల వాడకంపై అవగాహన అవసరం'


ప్రజాశక్తి - మంత్రాలయం

పంటల మార్పిడి, అంతర్ పంటలు, ఎరువుల వాడకంపై రైతులు అవగాహన ఉండాలని ఆత్మ, వ్యవసాయ అధికారులు తెలిపారు. శుక్రవారం మండలంలోని వగరూరు, తిమ్మాపురం గ్రామాల్లో ఆత్మ ఎడిఎ వెంకటేశ్వర్లు, ఎఒ జీరా గణేష్ మిశ్రమ పంటలు, ఎరువుల వాడకం, పంటల మార్పిడి, మిరప పంటలో ఆకు ముదురు నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరిస్తూ, నానో యూరియా వాడడం వల్ల పంటల దిగుబడులు పొందవచ్చని పేర్కొన్నారు. పొగాకు, మొక్కజొన్న పంటలను పరిశీలించి, కంపెనీలతో అగ్రిమెంట్ చేసుకోవాలని, పొగాకులో లద్దెపురుగు నివారణకు చేపట్టాల్సిన జాగ్రత్తలను వివరించారు. పత్తి కొనుగోలుకు ఆర్‌ఎస్‌కెలో పేర్లు నమోదు చేయించుకోవాలని, 8 నుంచి 12 శాతం వరకు తేమ ఉండే పత్తిని విక్రయించుకోవాలని కోరారు.

ఆర్‌టిసి డిఎంకు సన్మానం

ప్రజాశక్తి - హాలహర్వి

ఆర్‌టిసి డిపో మేనేజర్ రఫీక్‌ను కామినహాల్ గ్రామస్తులు సన్మానించారు. హాలహర్వి మండలం కామినహాల్ గ్రామానికి ఈనెల 1 నుంచి బస్సు సర్వీసును నడపడంతో శుక్రవారం కామినహాల్ గ్రామస్తులు డిపో మేనేజర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువా, పూలమాల వేసి సన్మానించారు. గ్రామస్తులు మాట్లాడుతూ... గత కొన్నేళ్లుగా బస్సు సౌకర్యం లేకపోవడంతో రాకపోకలకు ఇబ్బంది పడేవారని తెలిపారు. గర్భిణులు, బాలింతలు, విద్యార్థులు ఎక్కడికైనా ప్రయాణం చేయాలంటే దాదాపుగా 6 కిలోమీటర్ల వరకు నడుచుకుంటే వెళ్లే వారని చెప్పారు. బస్సు సర్వీసు నడిపించిన ఆర్‌టిసి డిపో మేనేజర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. దస్తగిరి, రుద్ర గౌడ్, బండారి రంగయ్య, పెద మాబు సాబ్, కట్టుబడి వెంకటేష్, విజయ్ పాల్గొన్నారు.


డిపో మేనేజర్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

అథ్లెటిక్స్‌లో 'మోడల్' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - ఆస్పరి

కర్నూలులో జరిగిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ విభాగంలో ఆస్పరి మండలం మోడల్ స్కూల్ విద్యార్థులు సత్తా చాటి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని వ్యాయామ ఉపాధ్యాయులు రాముడు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అండర్-14 లాంగ్ జంప్ విభాగంలో సి.శివ శంకర్ బంగారు పతకం సాధించారని, సాయి కృష్ణ 400 మీటర్ హై జంప్‌లో ద్వితీయ స్థానం సాధించారని తెలిపారు. అండర్-17 విభాగంలో కె.లక్ష్మీ పోల్వాల్ట్‌లో మొదటి స్థానం, ఎస్.శిరీష హ్యామర్ త్రోలో రెండవ స్థానం, ఈ.అంజలి 400 మీటర్ హర్డిల్స్‌లో మొదటి స్థానంలో నిలిచారన్నారు. అండర్-14లో ఎంపికైన వారు ఈనెల 8, 9వ తేదీల్లో శ్రీకాకుళంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. అండర్-17 విభాగంలో ఎంపికైన వారు గుంటూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. మోడల్ స్కూల్ నుంచి ఐదుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల ప్రిన్సిపల్ షమీల హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులను, వ్యాయామ ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు అభినందించారు.

జిల్లాస్థాయి పోటీల్లో కెజిబివి విద్యార్థులు

ప్రజాశక్తి - హాలహర్వి

హాలహర్వి కెజిబివి విద్యార్థులు జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటారు. శుక్రవారం కర్నూలు నగరంలోని బీఎస్సీ నర్సింగ్ కళాశాలలో జిల్లాస్థాయి పోటీలకు హాజరయ్యారు. కెజిబివి నుంచి ఒకేషనల్ ట్రైనర్ జి.సునీత సమక్షంలో 9వ తరగతి నుంచి స్నేహ, జెన్నీఫర్, 10వ తరగతి నుంచి తనూష, ఇంటర్ మొదటి సంవత్సరం నుంచి నిఖిత, ద్వితీయ సంవత్సరం నుంచి లక్ష్మి పాల్గొన్నారు. గ్రామ, మండల స్థాయిలో విద్యార్థులు స్టిచ్చింగ్, డ్రాయింగ్‌లో ప్రతిభ కనబరచడంతో అప్పారెల్ మేడ్ అప్ జిల్లాస్థాయి స్కిల్ కాంపిటీషన్‌కు ఎంపికయ్యారు.


పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

దేశభక్తి కలిగి ఉండాలి

- దేశాయ్ నెట్‌వర్క్ అధినేత గురురాజ్ దేశాయ్

ప్రజాశక్తి - నందవరం

విద్యార్థులు దేశభక్తి కలిగి ఉండాలని దేశాయ్ నెట్‌వర్క్ అధినేత గురురాజ్ దేశాయ్ తెలిపారు. శుక్రవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ ఆధ్వర్యంలో వందేమాతరం గీతాలాపన నిర్వహించారు. ముఖ్య అతిథిగా గురురాజ్ దేశాయ్ పాల్గొని వందేమాతర గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వందేమాతరం గీతం రచించి 150 సంవత్సరాలు పూర్తయిందని తెలిపారు. వందేమాతరం గీతాన్ని రచించిన బంకించంద్ర ఛటర్జీకి ధన్యవాదాలు చెప్పారు. విద్యార్థి దశ నుంచే దేశభక్తి పట్ల అభిమానం పెంచుకోవాలన్నారు. విద్యార్థులు బాగా చదవి పాఠశాలకు, గ్రామానికి మంచిపేరు తీసుకురావాలని తెలిపారు. సిఆర్‌పి ఉరుకుంద, మాజీ సర్పంచి, ఎల్ఎల్‌సి కాలువ ఛైర్మన్ రామన్న గౌడ్, కల్లెల్ శివ, డానియల్, మైనార్టీ నాయకులు అబ్దుల్, గని, మిన్నెల్లా, సోషల్ మీడియా కన్వీనర్ దండు వీరేష్ పాల్గొన్నారు. **చిప్పగిరి**లోని కెజిబివి, జూనియర్ కళాశాల, ఫాతిమా ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఎస్ఐ సతీష్ కుమార్ విద్యార్థులతో కలిసి వందేమాతరం ఆలపించారు. ఆయన మాట్లాడుతూ... వందేమాతరం గీతాన్ని నవంబర్ 7, 1875న బంకించంద్ర ఛటర్జీ రచించారన్నారు. నేటికీ 150 సంవత్సరాలు పూర్తి చేసుకుందన్నారు. అనంతరం జూనియర్ కళాశాలలో అధ్యాపకులతో ఎస్ఐ సతీష్ కుమార్ సమావేశం నిర్వహించి మాట్లాడారు. సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని, కళాశాలకు వచ్చే విద్యార్థులందరూ ఆటోల్లో లేదా బస్సుల్లో వచ్చేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు. కళాశాల ప్రిన్సిపల్ వరదరాజులు, పోలీసులు రామోజీ, మురళీకృష్ణ, శంకర్, కెజిబివి సిబ్బంది, ఫాతిమా పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ అల్లాబకాష్, తహశీల్దార్ ఇజాజ్ అహ్మద్, డిప్యూటీ ఎంపిడిఒ నాగరాజు ఆధ్వర్యంలో ఎంఇఒ సావిత్రమ్మ, పంచాయతీ కార్యదర్శులు వందేమాతర గీతాలాపన నిర్వహించారు. **ఆదోని** పట్టణంలోని భాష్యం పాఠశాలలో ప్రిన్సిపల్ రవి ప్రకాష్ ఆధ్వర్యంలో జాతీయ జెండాను ప్రదర్శించారు. ఆదోని భాష్యం-2 పాఠశాలలో జడ్ఇఒ మాచాని కవిత, వైస్ ప్రిన్సిపల్ అంజి, ప్రధానోపాధ్యాయుల మహేశ్వరి, పిటి మాస్టర్ బలరాం పాల్గొన్నారు.


నందవరంలో మాట్లాడుతున్న గురురాజ్ దేశాయ్


చిప్పగిరిలో వందేమాతరం గీతాలాపన చేస్తున్న అధికారులు


ఆదోనిలో 150 ఆకారంలో కూర్చున్న విద్యార్థులు


సీజనల్ హాస్టళ్లతో విద్యార్థులకు భరోసా

- ఎస్ఐ దిలీప్ కుమార్, ఎంఇఒలు సుధారాణి, కబీర్ సాబ్

- హోళగుందలో సీజనల్ హాస్టళ్లు ప్రారంభం

ప్రజాశక్తి - హోళగుంద

సీజనల్ హాస్టళ్లతో వలస విద్యార్థులకు భరోసా లభిస్తుందని ఎస్ఐ దిలీప్ కుమార్, ఎంఇఒలు సుధారాణి, కబీర్ సాబ్ తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా సమగ్ర శిక్ష సౌజన్యంతో అంబేద్కర్ సెల్ఫ్ హెల్ప్ గ్రూపు, వరలక్ష్మి సెల్ఫ్ హెల్ప్ గ్రూపు ఆధ్వర్యంలో శుక్రవారం హోళగుందలో సీజనల్ హాస్టళ్లను ప్రారంభించారు. ముఖ్యఅతిథులుగా వారు హాజరయి మాట్లాడారు. తల్లిదండ్రులు వలస వెళితే పిల్లలు చదువుకు దూరం కాకూడదని ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న సీజనల్ హాస్టళ్లను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని బాగా చదువుకోవాలని సూచించారు. హాస్టల్ విద్యార్థులు చెరువులు, బావులు, ఎల్ఎల్‌సి కాలువల వద్దకు స్నానాల కోసం వెళ్లకుండా ఇక్కడే స్నానం చేయాలని తెలిపారు. ప్రమాదాలు సంభవిస్తే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని సూచించారు. సిఆర్‌పిలు లక్ష్మప్ప, తుకారాం, రేణుక, జిల్లా పరిషత్ ప్రధానోపాధ్యాయులు కబీర్ సాహెబ్, ప్రధానోపాధ్యాయులు చిన్నయ్య రెడ్డి, ఉషోదయ గ్రామీణాభివృద్ధి సంస్థ వ్యవస్థాపకులు సిహెచ్.నాగరాజు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఐ దిలీప్ కుమార్

IN THE COURT OF THE HON' BLE IV ADDL DIST. JUDGE :: KURNOOL: E.P.No. 394/2024 in A.A. No.753/2020

Between:
M/s Shriram Finance Co Ltd..
Represented by its GPA Holder.
B.Hari Krishna Chary.
...Claimant/Decree Holder

-Versus-

Mr. C.Sudhakar and another
... Respondents/Judgment Debtors

Mr.1. C.Sudhakar S/o.C.Bajari
H.No. 4-327-8, Near Nagamma temple
Gudur (V), (M), Kurnool District-518466
Mr. 2. S.Srinu S/o. S. Eddula Dubbanna
H.No. 9-114-6, Singani Street, Gudur (V),(M),
Kurnool District-518466. ..JDR'S

1,2 వ ప్రతివాదులకు ఆర్డర్ 21 రూల్ 22 నోటీసు :

పై నంబర్ అమలు అర్జీ (E.P.) లో వాది Dhr. అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ వారు 1,2 వ ప్రతివాదులైన (JDr.1&2) మీ పైనా ఆర్బిటేషన్ అవార్డును పొంది అవార్డు అమలు చేయమని కోరుతూ అమలు అర్జీ (E.P.) దాఖలు చేసి ఉన్నారు. పై అమలు అర్జీ నందు కోర్టువారు మీకు మీరున్న అడ్రసుకు order 21, Rule. 22, నోటీసులు ఎన్నిసార్లు పంపించిన ఉద్దేశపూర్వకంగా తీసుకోకుండా తిప్పి వెనుకకు పంపుతూ ఉన్నారు. కావునా పై అమలు అర్జీ నందు మీకు ఏమైనా ఆక్షేపనలు వున్న ఎడల పై కోర్ట్ వారి యెదుట 11-11-2025వ తేదీన ఉదయం 10:30 గంటలకు kurnool కోర్టు నందు హాజరై మీ ఆక్షేపనలు తెలుపుకోవలెను. లేని యెడల పై అమలు అర్జీ మీ పరోక్షమందు తీర్మానించబడునని తెలియజేయడమైనది.

(కోర్టు ఉత్తర్వుల మేరకు)

తేది: 11.11.2025

బి.శ్రీనివాసులు,
యం.కుమార్,
ADVOCAT FOR DHR KURNOOL

అవినీతి అధికారులపై లోకాయుక్త కొరడా

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

నిధుల దుర్వినియోగానికి పాల్పడిన అవినీతి అధికారులపై లోకాయుక్త కోరడా ఘులిపించింది. ఈ మేరకు లోకాయుక్త కార్యాలయం అందుకు సంబంధించిన వివరాలను మీడియాకు వెల్లడించింది. తూర్పుగోదావరి జిల్లా, రాజమహేంద్రవరం గ్రామీణ మండలం పరిధిలోని బొమ్మూరు, కాతేరు, హుకుంపేట, పిడింగొయ్యి గ్రామ పంచాయితీలలో పంచాయితీ నిధుల దుర్వినియోగం, అక్రమ లే-అవుట్లు, అనధికార నిర్మాణాలకు సంబంధించి మచిలీపట్నంకు చెందిన ఐజె. శ్రీనివాస గౌడ్ లోకాయుక్తను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. దాఖలు చేసిన ఫిర్యాదులను విచారణకు ఆంధ్రప్రదేశ్ ఉపలోకాయుక్త పి.రజని ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఫిర్యాదులపై వివరణాత్మక విచారణ ప్రభుత్వ ఉత్తర్వులు ,విజిలెన్స్ నివేదికల పరిశీలన తర్వాత పంచాయితీ రాజ్ ,గ్రామీణాభివృద్ధి శాఖకు చెందిన పది మంది అధికారులపై క్రమశిక్షణా చర్యలు చేపట్టింది. ఫలితంగా ఎనిమిది మంది అధికారులపై చర్యలు పూర్తి కాగా, ఇద్దరిపై ఇంకా క్రమశిక్షణా చర్యల ప్రక్రియ పూర్తి కాలేదు. ఈ క్రమంలో డివిజనల్ స్థాయి పంచాయితీ అధికారి కెపి. చంద్రశేఖర్‌కు రెండు వార్షిక గ్రేడ్ కార్యదర్శిపై పెన్షన్లో 5 శాతం శాశ్వత కోతను ప్రతిపాదిస్తూ షోకాజ్ నోటీసు జారీ చేశారు. విజయరాజుపై, ప్రధాన జరిమానాను ప్రతిపాదిస్తూ మెమో జారీ చేసింది. ఇతర అధికారులైన పి.రామప్రసాదరావు, జి. బెనార్ ఎడ్వర్డ్, ఎస్.రామ మోహనరావు, బి.మహేశ్వర ప్రతాప్, డి.శ్రీనివాసరావు, ఎస్.సుభాషిణీలపై క్రమశిక్షణా చర్యలు తగ్గించారు. ఈ అవినీతి అధికారులపై క్రమశిక్షణా చర్య తీసుకున్న క్రమంలో ఉప-లోకాయుక్త మిగిలిన అధికారులపై తీసుకున్న చర్యలపై తుది నివేదికను 2026 జనవరి 29 లోపు ఈ సంస్థకు సమర్పించాలని కమిషనర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పంచాయితీ రాజ్ , గ్రామీణాభివద్ధి శాఖ వారిని ఆదేశించారు. ఈ సిఫార్సులతో, ప్రభుత్వ నియమాలు, ఆదేశాలకు అనుగుణంగా గణనీయమైన క్రమశిక్షణా చర్య తీసుకున్న నేపథ్యంలో ఈ ఫిర్యాదును మూసివేయాలని ఆదేశించారు.

కర్నూలు ఉత్సవ్ 2025 విజయవంతం

ప్రజాశక్తి-కర్నూలు కల్చరల్

నవంబర్ ఒకటో తేదీ కర్నూలు ఉత్సవ్ 2025 ప్రారంభమై శుక్రవారం 7న రాత్రి వైభవంగా ముగిశాయి. ప్రతిరోజు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు సాంస్కృతిక, సంగీత, సాహిత్య కార్యక్రమాలు జరిగాయి ఒకటో తేదీ కలెక్టరేట్ నుంచి కళాక్షేత్రం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం పౌరాణిక ఏకాంకిక నాటక పోటీలు ప్రారంభమయ్యాయి. ఇందులో నంద్యాల కర్నూలు జిల్లాల నుంచి 40 కళా సంస్థలు పోటీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాలను తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ నమోదు చేసింది. వరుసగా మూడోసారి రికార్డు సృష్టించడం విశేషం. ఈ సందర్భంగా స్వాతంత్ర సమరంలో పాల్గొన్న 26 మంది జిల్లా ప్రముఖులు, నాటక ప్రముఖుల ఫోటో ఎగ్జిబిషన్ విశేషంగా ఆకట్టుకుంది. మొదటిసారి ఇంత భారీ ఎత్తున ప్రముఖులను చూపించారు. ప్రతిరోజు వివిధ రంగాలకు చెందిన విశిష్ట వ్యక్తులను సన్మానించారు. జిల్లా ప్రత్యేకతను గురించి ప్రతిరోజు కవులు కవితలను వినిపించారు. ఈ విధంగా వారం రోజులపాటు 250 మంది కవులు నటులు కళాకారులు సత్కరించడం ఒక ప్రత్యేకతను సంతరించుకుంది.

విజేతలకు టీజీ అభినందనలు

పద్య నాటక పోటీల్లో విజయం సాధించిన కళాకారులను మాజీ రాజ్యసభ సభ్యులు టిజివెంకటేష్ అభినందిస్తూ కళాకారులకు కళా సంస్థ సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. 12 గంటల పాటు ప్రతిరోజు ప్రదర్శనలు ఇచ్చి శ్రోతలను ఆకట్టుకోవడం అభినందనీయమన్నారు. కర్నూలు జిల్లా విశిష్టతను పాఠశాల విద్యార్థులకు తెలియజేయడం కోసం వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలను



విద్యార్థినికి జ్ఞాపికను బహూకరిస్తున్న టిజి.వెంకటేష్; జి.పుల్లయ్య , తదితరులు

ప్రకటించగా వారిని ఆయన ప్రశంసా పత్రాలు, శాలువాలు, పారితోషికంతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పారిశ్రామికవేత్త బివి. రెడ్డి , రవీంద్ర విద్యాసంస్థల డైరెక్టర్ జి పుల్లయ్య, మాంటిసోరి విద్యాసంస్థల అధినేత రాజశేఖర్, కాపునాడు రాష్ట్ర అధ్యక్షుడు ఆర్జా రామకృష్ణ, టీజీవి కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య పాల్గొన్నారు. విశిష్ట వ్యక్తులకు సత్కారం వివిధ రంగాల్లో పేరొందిన కళాకారులు మిమిక్రీ ఉస్మాన్ ఓంకార్ చాంద్‌బాషా, నంద్యాల శంభు ప్రసాద్, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు బసవరాజు సేవా రంగంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షులు కేజీ గంగాధర్,. కెడిజె. బాబు , కె. ప్రతాపరెడ్డి లను టీజీ వెంకటేష్ , బీవీ రెడ్డి, జి పుల్లయ్య , కె.రాజశేఖర్, పత్తిఓబులయ్య సత్కరించారు. వారం రోజులపాటు నాటక పోటీలకు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించిన పి.రాజారత్నం, జానకిరాములను అతిథులు సత్కరించారు. అంతకుముందు బి.మల్లేశ్వరి, కరీముల్ల, శిష్య బృందం శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు చేశారు. మహమ్మద్ మియ్యా బృందం జానపద గజల్స్ కార్యక్రమాలను నిర్వహించారు.

భార్యను హత్య చేసిన భర్తకు జీవిత ఖైదు

-రూ. 10 వేల జరిమాన

-తీర్పు వెలువరించిన కర్నూలు మొదటి అదనపు జిల్లా సెషన్స్ జడ్జి కమలా దేవి

-వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

భార్యను హత్య చేసిన కేసులో భర్తకు జీవిత ఖైదుతో పాటు రూ.పదివేలు జరిమాన విధిస్తూ కోర్టు శిక్షను విధించిందని జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ తెలిపారు. ఎస్‌పి తెలిపిన వివరాల ప్రకారం... శుక్రవారం ముద్దాయి శ్రీనివాసులు అతని భార్య లక్ష్మీదేవి 2007 లో ఇద్దరు కూడా ప్రేమ వివాహం చేసుకున్నారు. ఆర్‌టిసి బస్టాండ్ దగ్గరలోని శివప్పనగర్ లో నివాసం ఉంటున్నారు. భర్త శ్రీనివాసులు ఆర్‌టిసి బస్టాండ్ వద్ద టీ స్టాల్ పెట్టుకొని జీవించేవాడు. ఇతని పై కర్నూలు నాల్గవ పట్టణ పోలీసు స్టేషన్‌లో రౌడీ షీట్ ఉండేది. పెళ్లి అయిన 11 సంవత్సరాల తర్వాత తన భార్య ప్రవర్తన మీద అనుమానం ఉండి తరచూ గొడవలు పడుతూ 2018 నవంబర్ 18 తేదిన తన భార్యని భర్త శ్రీనివాసులు గొంతు నులిమి చంపారు. ఈ విషయం పై కర్నూలు నాల్గవ పట్టణ పోలీసుస్టేషన్ లో క్రైమ్ నెంబర్ 415/ 2018 కింద మర్డర్ కేసుగా నమోదు చేశారు. అప్పట్లో దర్యాప్తు అధికారిగా సిఐ డి. మహేశ్వర్ రెడ్డి ఉన్నారు. ఛార్జ్ షీట్ వేశారు. అన్ని కోణాల్లో ఈ కేసును విచారించిన పిదప నేరం రుజువు కావడం తో ముద్దాయి శ్రీనివాసులుకు జీవిత ఖైదు రూ. 10 వేల జరిమానా విధిస్తూ కర్నూలు మొదటి అదనపు జిల్లా సెషన్స్ జడ్జి కమలా దేవి శుక్రవారం తీర్పును ఇచ్చారు. కేసు వాదించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ సి. సరళాదేవిని,



ముద్దాయిన కోర్టులో హాజరు పరిచి జైలుకు తీసుకెళ్తున్న పోలీసులు

కేసు నమోదు చేసి, పక్కాగా దరాప్తు చేసిన కర్నూలు డిఎస్‌పి బాబు ప్రసాద్, కర్నూలు నాల్గవ పట్టణ సిఐ విక్రమసింహాలను, సాక్షులను కోర్టులో హాజరు పరిచిన ఎఎస్ఐ సుబ్బరాజు, కోర్టు కానిస్టేబుల్ ఎం. వెంకటరమణలను జిల్లా ప్రత్యేకంగా అభినందించారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

సిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ శ్రీమంత్ మాదన్న

ప్రజాశక్తి- కోడుమూరు

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలంతా అవగాహనతో అప్రమత్తంగా ఉండాలని కోడుమూరు కోలోకేటెడ్ పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ శ్రీమంత్ మాదన్న సూచించారు. శుక్రవారం పిహెచ్‌సి 1 గొల్ల వీధిలో నిర్వహించిన అవగాహన శిబిరంలో మాట్లాడుతూ కీటక జనత వ్యాధులైన డెంగీ, మలేరియా, చికెన్ గున్యా వ్యాధులు రాకుండా ఉండాలంటే దోమలను నిర్మూలించాలన్నారు. దోమలకు ఆవాసంగా ఉండే నీటి నిల్వలు పరిసర ప్రాంతాలలో ఉండకుండా జాగ్రత్తలు పడాలన్నారు. ప్రజలు ప్రతి ఒక్కరు కూడా కాచి చల్లార్చిన వేడినీళ్లు, వేడిఆహారం తీసుకోవాలన్నారు. కోడుమూరులో టైఫాయిడ్ కేసులున్న చుట్టుపక్క గ్రామాలైన పోలకల్లు, గూడూరు, చనిగొండ్ల, దేవనకొండ నుండి రావడం వలన ఎక్కువ కేసులు నమోదవుతున్నాయని అన్నారు. ఈ విషయమై సిహెచ్‌సి డాక్టర్‌తో కోఆర్డినేషన్ చేసుకొని అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. గ్రామపంచాయతీ, ఆర్‌డబ్ల్యుఎస్ సహకారంతో ఇంటింటికి తిరుగుతూ రక్త పరీక్షలు చేస్తున్నామన్నారు. స్నేహ అనే పాప ఇంటికి వెళ్లి చెక్ చేశామని డిశ్చార్జ్ అయిన ఆ అమ్మాయికి వైరల్ ఫీవర్, టైఫాయిడ్ రాలేదని చలి జ్వరంతో బాధపడుతుందని, ఇప్పుడు బాగుందని అన్నారు. మెడికల్ క్యాంపు ఇంకా మూడు నాలుగు రోజులు ఇలాగే కొనసాగిస్తామని జ్వరాలు తగ్గే వరకు ఇంటింటికి వెళ్లి రక్త పరీక్షలు చేస్తామన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత ద్వారా వ్యాధులకు దూరంగా ఉంచవచ్చన్నారు. ఎంపిడిఒ ఎసి.రాముడు మాట్లాడుతూ కోడుమూరు చుట్టుపక్కల గ్రామాలలో ఎక్కువగా ఉన్న జ్వరాల దృష్ట్యా గ్రామాల్లో ఎక్కువగా నీరు నిల్వ ఉండకుండా గుంతలను పూడ్చివేయాలని, మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని పరిశుద్ధ కార్యక్రమాలు నిర్వహించాలని పంచాయతీ ప్రత్యేక అధికారికి, పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు.



విద్యుత్ సౌధ వ్ద వందేమాతం గీతాలాపన చేస్తున్న అధికారులు, సిబ్బంది

వందేమాతరం గీతాలాపన

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

వందేమాతర గీతం రచించి 150 సంవత్సరాలు అయిన సందర్భంగా శుక్రవారం కర్నూలు విద్యుత్ భవనం కర్నూలు ప్రాంగణం లో , వివిధ డివిజన్ ఆఫీస్‌ల పరిధిలో , అన్ని ఆఫీసులలో విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది వందేమాతరం గీతాన్ని ఆలపించారని ఎపిఎస్‌పిడిసిఎల్ ఎస్‌పి ప్రవీణ్ కుమార్ తెలిపారు.

వందేమాతరం ఆత్మవిశ్వాసానికి నినాదం

వందేమాతరం గేయ శబ్దం విన్నప్పుడు ప్రతి భారతీయుడులో ఆత్మవిశ్వాసం నింపుతుందని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ ఆర్‌జివికృష్ణ అన్నారు. భారతీయ జాతీయ గేయం వందేమాతరం రచించి 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం నగరపాలక కార్యాలయంలో ఉద్యోగులు వందేమాతరం గేయాన్ని ఆలపించారు. అదనపు కమిషనర్ ఆర్‌జివి కృష్ణ మాట్లాడుతూ వందేమాతరం గేయం గొప్పతనాన్ని వివరించారు. మేనేజర్ ఎన్.చిన్నరాముడు, అకౌంట్స్ ఆఫీసర్ చుండి ప్రసాద్, ఆర్ఒ జునైద్, సిబ్బంది కృష్ణమోహన్, శ్రీదేవి, శోభరాణి సరస్వతి, నాగరాజు, శ్రీనివాసులు, శివ, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో విజేతలుగా రాణించాలి

-ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్ అలీమ్ బాష

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలోనీ లయోలా కళాశాల క్రీడా మైదానంలో ఈ నెల 8, 9 తేదీలలో జరగబోయే రాష్ట్రస్థాయి సీనియర్ పురుషుల సాఫ్ట్ బాల్ పోటీలలో రాణించాలని ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్ అలీమ్‌బాష సూచించారు. ఆయన క్రీడాకారులకు క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీల్లో అద్భుతంగా రాణించి జిల్లాకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించడానికి తాను ఎల్లప్పుడూ ముందుంటానని అన్నారు. జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కుబేర నాయుడు, సంయుక్త కార్యదర్శి అయ్యన్న గౌడు, కార్యవర్గ సభ్యుడు శాంతరాజ్, జిల్లా సాఫ్ట్ బాల్ కార్యదర్శి విజయ్ కుమార్ ఉన్నారు.

బిజెపి ఉత్సవాలు చేసుకోవడం విడ్డూరం

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్

వందేమాతర గీతంపై బిజెపి నాయకులు ఉత్సవాలు చేసుకోవడం విడ్డూరంగా ఉందని మాజీ ఎమ్మెల్సీ, ఎఐసిసి సభ్యులు ఎం.సుధాకర్‌బాబు అన్నారు. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్వాతంత్ర ఉద్యమంలో కనీసం పాల్గొనని బిజెపి నాయకులు నేడు సంబరాలు జరుపుకోవడం సరైనది కాదన్నారు. అధికారం కోసం దేశాన్ని విభజిస్తున్నారని విమర్శించారు. ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు బి బతుకన్న, ఒబిసి సెల్ జిల్లా చైర్మన్ డివి సాంబశివుడు, ఎస్‌సి సెల్ మాజీ జిల్లా అధ్యక్షులు ఇ. లాజరస్, ఐఎన్‌టియుసి సిటీ అధ్యక్షులు ఆర్.ప్రతాప్, కాంగ్రెస్ నాయకులు డబ్ల్యు.సత్యరాజు, బి .సుబ్రహ్మణ్యం, హుస్సేన్ పాల్గొన్నారు.

వ్యర్థాల నిర్వహణలో నిబంధనలు పాటించాలి

జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్



ప్రభుత్వ, ప్రైవేట్ ఆసు పత్రులు, ల్యాబ్‌లు, క్లినిక్‌లు ,డయా గ్నోస్టిక్ సెంటర్లు బయో మెడికల్ వ్యర్థాల నిర్వ హణలో నిబంధనలను పాటించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్ర వారం కలెక్టరేట్‌లో కాలుష్య నియంత్రణ చర్యలపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.. రోగులు, సిబ్బంది,ప్రజల ఆరోగ్య భద్రత దష్ట్యా వైద్య వ్యర్థాలను సక్రమంగా వేరు చేసి, శాస్త్రీయ పద్ధతిలో నిర్వర్తించాల్సిన అవసరం ఉందని సూచించారు. ఆసుపత్రులలో కాలం చెల్లిన మందులను సక్రమంగా ధ్వంసం చేయడం తప్పనిసరి అని స్పష్టం చేశారు. సమీక్ష అనంతరం జిల్లా కలెక్టర్ 'చెత్తను వేరు చేసే ముందు ఆలోచించండి' అనే గోడపత్రికను ఆవిష్కరించారు. ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఇఇ కిషోర్, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ భాస్కర్, చంద్రమోహన్ రెడ్డి, పబ్లిక్ హెల్త్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ,డాక్టర్ జఫ్రుల్లా, డిసిహెచ్‌ఎస్ డాక్టర్ వెంకటేశ్వర్లు, జిజిహెచ్ సూపరింటెండెంట్ , డాక్టర్ వెంకటేశ్వర్లు, ఐఎంఏ ప్రతినిధులు, కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు, గూడూరు మున్సిపల్ ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.